
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 సిద్దిపేట

బుధవారం 16 అక్టోబరు 2024

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే

కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయశాఖ అధికారి రాధిక 8

సయ్యద్‌నగర్ టు గల్ఫ్

ఆ గ్రామం నుంచి ఇంటికొకరుగా పయనం

- ఉన్న ఊరిలో బతుకుదెరువు లేక అరబ్ దేశాలకు..
- ప్రస్తుతం వివిధ దేశాల్లో ఓ మహిళతో సహా 70 మంది
- నామమాత్రపు వేతనాలకు గల్ఫ్ దేశాల్లో మగ్గుతున్న పల్లెవాసులు

7 లో..

ఉన్న ఊరిలో ఉపాధిలేదు.. బతుకుదెరువు భారంగా మారింది.. చేసేదేమీ లేక కుటుంబపోషణ కోసం ఒకరు.. చేసిన అప్పులు తీర్చడానికి మరొకరు.. ఇలా పలుకారణాలతో సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం సయ్యద్‌నగర్ గ్రామం నుంచి ఇంటికొకరు చొప్పున గల్ఫ్ బాట పట్టారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ ఆయా దేశాల్లో నానా కష్టాలు పడుతున్నారు. అక్కడ వెళ్లాక వారు చెప్పే పనులు చేయలేక.. స్వగ్రామానికి రాలేక అనేకమంది సతమతమవుతున్నారు..



దసరా ధమాకా

- సిద్దిపేట ఆర్టీసీ డిపోకు రూ.కోటి పైగా ఆదాయం
- గతేడాది కంటే రూ.36 లక్షలు అదనం

సిద్దిపేట అర్బన్, అక్టోబరు 15: దసరా పండుగ సందర్భంగా ఆర్టీసీకి కాసుల వర్షం కురిసింది. సిద్దిపేట డిపో పరిధిలో 384 మంది సిబ్బంది, 104 బస్సులు ఉన్నాయి. గతేడాది దసరాకు 2,03,474 కిలోమీటర్లు బస్సులు తిరగగా రూ.83,43,945 ఆదాయం వచ్చింది. ఈ సంవత్సరం 2,04,795 కిలోమీటర్లు ప్రయాణించగా రూ.1,19,36,697 ఆదాయం సమకూరింది. మహాలక్ష్మి పథకంపై 3,83,095 మహిళలు ప్రయాణించారు. ఆర్టీసీకి ఈ ఆదాయాన్ని 7 రోజుల నుంచి పరిగణలోకి తీసుకున్నట్లు మేనేజర్ తెలిపారు. రద్దీ దృష్ట్యా బస్సులు సరిపోక పోవడంతో ప్రైవేట్ బస్సులను సర్దుబాటు చేశారు. అయితే కొన్నిచోట్ల అదనపు చార్జీలు వసూలు చేశారంటూ ప్రయాణికులు తెలిపారు. సిబ్బంది కృషి వల్లే డిపోకు రూ.కోటికిపైగా ఆదాయం సమకూరినట్లు సిద్దిపేట డిపో మేనేజర్ సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఆయన అభినందనలు తెలియజేశారు.





సిద్దిపేటలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు

మా స్టార్స్

'ఉద్యోగాలు ఊరికే రావని... పక్కా ప్రణాళిక, కఠోర శ్రమ, నిరంతర అధ్యయనం, పట్టువదలని ప్రయత్నాలతోనే తమ లక్ష్యాన్ని సాకారం చేసుకున్నాం' అని అంటున్నారు ఇటీవల ఉపాధ్యాయులుగా ఎంపికైన విజేతలు. బీఈడీ, డైట్ చదివి, టెట్ పరీక్షలో మార్కులు కూడబెట్టి డీఎస్సీలో నిరాశ ఎదురైనా వెనక్కి తగ్గలేదని అంటున్నారు. ఒకసారి విఫలమైతే ఇంకోసారి, మరొకసారి, చివరిసారి అంటూ టార్గెట్లు పెట్టుకుంటూ గమ్యాన్ని చేరుకున్నామని గర్వంగా చెబుతున్నారు. ఓవైపు వయసు మీదపడుతోంది.. మరోవైపు కుటుంబపోషణ భారమవుతుంది.. అయినా కళ్లముందే లక్ష్యం ఊరిస్తుంది.. ఇక తాడోపేడో అంటూ తేల్చుకొని కొలువులు కొల్లగొట్టిన ఈ మాస్టార్లు నిజంగా స్టార్లుగా ప్రకాశించారు. వీరి జీవిత అనుభవాలే రేపటి పౌరులుగా తీర్చిదిద్దబోయే విద్యార్థులకు పాఠాలు కానున్నాయి. పోస్టింగ్ ఆర్డర్లు అందుకోవడానికి మంగళవారం కౌన్సెలింగ్‌కు హాజరైన కొత్త టీచర్లు 'ఆంధ్రజ్యోతి' ముచ్చటించారు..

– ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట/ సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 15

- లక్ష్యం పెట్టుకున్నారు..కొలువు పట్టుకున్నారు
- ఉపాధ్యాయ ఉద్యోగం వెనుక కఠోరశ్రమ
- పట్టువదలని ప్రయత్నంతో విజేతలుగా..
- జీవిత పరీక్షలో నెగ్గిన కార్యసాధకులు
- పూర్తయిన డీఎస్సీ కౌన్సెలింగ్
- 'ఆంధ్రజ్యోతి'తో కొత్త టీచర్ల మాటముచ్చట

7



సెంటర్ వద్ద అభ్యర్థులు, కుటుంబసభ్యులు

కౌన్సెలింగ్ ప్రక్రియలో

గందరగోళం

- వాయిదా వేశారని ప్రచారం, మధ్యాహ్నం మళ్లీ ప్రారంభం
- అలాట్మెంట్ లెటర్ అందుకున్న కొత్త సార్లు

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకూ డీఎస్సీ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తయింది. అయితే కాసేపు గందగోళ పరిస్థితి నెలకొన్నప్పటికీ జిల్లా అధికారుల అప్రమత్తతో ప్రక్రియ సజావుగా సాగింది. మంగళవారం ఉదయం కౌన్సెలింగ్ ఉంటుందని ఒకరోజు ముందు సోమవారం అభ్యర్థులకు సమాచారం అందించారు. పది గంటలకు కలెక్టర్ సమావేశ మందిరానికి రావాలని సూచించారు. తీరా ఉదయం తొమ్మిది గంటలకు బదిలీల ప్రక్రియ పూర్తికాలేదని, కౌన్సెలింగ్ వాయిదా పడిందన్నారు. అధికారులను ఆరా తీయగా పైఅధికారుల నుంచి ప్రక్రియను కాస్తా హోల్డ్‌లో పెట్టమన్నారని వారు తెలిపారు. అయితే జిల్లా అధికారులు ఉదయం కౌన్సెలింగ్‌కు వచ్చిన అభ్యర్థులకు ఒరియేంటేషన్ కార్యక్రమం చేపట్టారు. మధ్యాహ్నం సెషన్‌కు రావాల్సిన వారికి కూడా హాజరవ్వాలని సమాచారం ఇచ్చారు. ఈలోగా సుమారు 12 గంటల ప్రాంతంలో మళ్లీ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభించాలని పై నుంచి ఆదేశాలొచ్చాయి. జిల్లా అధికారులు కౌన్సెలింగ్ ప్రారంభించి స్కూలు అసిస్టెంట్, ఎస్‌జీటీ అన్ని విభాగాల అభ్యర్థులకు అలాట్మెంట్ ఆర్డర్స్‌ను అందజేశారు. అన్ని విభాగాలు కలుపుకొని 260 మంది అభ్యర్థులకు పోస్టింగ్ కేటాయించారు. జిల్లా విద్యాధికారుల అప్రమత్తతో కౌన్సెలింగ్ ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది.

డంపింగ్ యార్డుల్లో

ఎరువులు తయారు చేయండి

- పంచాయతీ కార్యదర్శులతో డీపీవో
- పని తీరు మార్చుకోని కార్యదర్శులకు మెమోలు జారీ చేయండి
- జిల్లాలోని ఎంపీవోలతో టెలీకాన్ఫరెన్స్‌లో దేవకీదేవి
- డంపింగ్ యార్డులను సందర్శించిన ఎంపీడీవో, ఎంపీవో

8

శిథిలమైన హాస్టల్ భవనం

- అరకొర వసతులతో అద్దె భవనంలో నిర్వహణ
- గత ప్రభుత్వ హయాంలో మొండిచేయి
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు

8





వైభవంగా అమ్మవారి శోభాయాత్ర

సిద్దిపేట కల్చరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నవరాత్రులు పూజలందుకున్న దుర్గామాత అమ్మవారి నిమజ్జన శోభాయాత్ర సిద్దిపేటలో అత్యంత వైభోవైతంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌లో పంచముఖి ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత శోభయాత్రలో మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొన్నారు. చెర్నాకోల్ పట్టుకుని అందరిని ఉత్సహపరిచారు. అమ్మవారి దయ అందరి మీద ఉండాలని ఆకాంక్షించారు.



గాంధీభవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో మాట్లాడుతున్న పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

టార్గెట్ లోకల్‌బాడీ

- స్థానిక సంస్థల ఎన్నికలకు శ్రేణులు సిద్ధం కావాలి
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో సత్తా చాటాలి
- పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ

మెదక్/సంగారెడ్డి టౌన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని పీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్, ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా కాంగ్రెస్ నాయకులతో స్థానిక సంస్థల ఎన్నికలపై సమీక్షా సమావేశం నిర్వహించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని సత్తాచాటాల్సిన అవసరం ఉన్నదన్నారు. గత పదినెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో ఇప్పటికే ఐదు గ్యారంటీలను అమలు చేసి మాట నిలబెట్టుకున్నామన్నారు. కాంగ్రెస్ పట్ల ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లో ప్రజలంతా కాంగ్రెస్‌కు పట్టం కట్టడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తమ తమ గ్రామాల్లో అనునిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. త్వరలోనే డీసీసీ అధ్యక్షుల ఆధ్వర్యంలో ప్రతీ మండలంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాలను ఏర్పాటు చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయదలచిన ఆశావాహులు ప్రజల మద్దతు చూరగొనేలా పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్, ఏఐసీసీ సెక్రటరీ విశ్వనాథం, టీజీఐఐసీ చైర్‌పర్సన్, కాంగ్రెస్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ ఎం.ఎ.ఫహీమ్, మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు, మెదక్ పార్లమెంట్ నియోజవర్గ ఇన్‌చార్జి నీలం మధు, పీసీసీ కార్యదర్శి తోపాజి అనంతకిషన్, జూలకంటి అంజనేయులు, కాంగ్రెస్ నాయకులు నర్సారెడ్డి, అంజనేయులు, ఆవుల రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పూజల హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని మనాలి పర్వతాన్ని అధిరోహించిన నగరం విద్యార్థి శివకుమార్‌రెడ్డి

'మనాలి'ని అధిరోహించిన

నగరం విద్యార్థి

మిరుదొడ్డి/దుబ్బాక,15(ఆంధ్రజ్యోతి): అక్బర్‌పేట-భూంపల్లి మండలం నగరం గ్రామానికి చెందిన కొరండ శివకుమార్‌రెడ్డి అనే విద్యార్థి హిమాచల్ ప్రదేశ్ మనాలిలోని మౌంట్ పటల్సు పర్వతాన్ని అధిరోహించినట్లు అంతర్జాతీయ మౌంటీర్, గిన్నిస్ రికార్డు గ్రహీత దికొండ శివరామకృష్ణారెడ్డి తెలిపారు. 4250 మీటర్ల ఎత్తు కలిగిన ఈ పర్వతాన్ని 12 గంటల్లో అధిరోహించినట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సేనో టూ డ్రగ్స్' అనే నినాద అవగాహనతో పర్వతాన్ని అధిరోహించినట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో

అన్నదాత మృతి

- పంటకు నీరందించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం
- తొగుట మండలం గుడికందులలో ఘటన

7



సిద్దిపేటలోని జీజీహెచ్ ఆస్పత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

ఆర్జీకార్ ఘటనపై విచారణ జరపాలి

- ఐఎంఏ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందర్

సిద్దిపేట టౌన్/గజ్వేల్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఆర్జీకార్ ఘటనపై పారదర్శకంగా విచారణ జరిపి నిందితులకు వెంటనే చట్టపరమైన శిక్ష వేయాలని ఐఎంఏ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు డాక్టర్ చందర్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని జీజీహెచ్ ఆస్పత్రి ఎదుట మమతా బెనర్జీ వ్యవహార శైలికి నిరసనగా, నిరవధికంగా నిరాహార దీక్ష చేస్తున్న వైద్యులకు సంఘీభావంగా, ఐఎంఏ దేశవ్యాప్తంగా నిర్వర్తిస్తున్న 12 గంటల నిరాహార దీక్షలో భాగంగా ఐఎంఎ సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో వైద్యులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చందర్ మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లోని ఆర్జీకార్ వైద్య కళాశాలలో వైద్య విద్యార్థిని హత్యాచారం చేసి రెండునెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని మండిపడ్డారు. అందుకు నిరసనగా పశ్చిమ బెంగాల్‌లో జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు పదిరోజులుగా నిరవధికంగా నిరాహార దీక్ష చేస్తున్నారని, కొందరు విద్యార్థుల ఆరోగ్యం విషమంగా ఉన్నా ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్ సీఎం, హోంమంత్రి, ఆరోగ్య మంత్రిత్వ శాఖలను స్వయంగా నిర్వర్తిస్తున్న మమతా బెనర్జీ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం తగదన్నారు. వైద్య విద్యార్థులు చేస్తున్న పది డిమాండ్లపై స్పందించి బాధితురాలి కుటుంబసభ్యులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో కార్యక్రమంలో ఐఎంఎ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గణేష్ శెట్టి, ట్రెజరర్ డాక్టర్ ప్రణీత్‌కుమార్, తానా ప్రెసిడెంట్ డాక్టర్ వి.వి.రావు, సీనియర్ వైద్యులు ఎస్.శ్రీనివాస్, భీమేష్, వీరన్న, నవీన్‌రెడ్డి, వేణుగోపాల్, అరుణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యులకు సంపూర్ణ రక్షణ కల్పించాలని ఐఎంఏ గజ్వేల్ వైద్యులు డిమాండ్ చేశారు. ఆర్జీకార్ జూనియర్ వైద్యులు చేపట్టిన దీక్షకు మద్దతుగా గజ్వేల్ పట్టణ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒకరోజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఐఎంఏ సెక్రటరీ కమిటీ మెంబర్ డాక్టర్ నరేశ్‌బాబు, తెలంగాణ ట్రెజరర్ డాక్టర్ పెంటాచారి, గజ్వేల్‌శాఖ అధ్యక్షుడు నాగమునెయ్య మాట్లాడారు. అనంతరం గజ్వేల్ ఆర్డీవో బన్సీలాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వారితో వైద్యులు ఎలిశాల లింగం, మహిపాల్, సాయినాథ్‌రెడ్డి, పద్మజ్యోతి, శైలజ, సురేశ్‌రెడ్డి, సుజాత, శివకుమార్, శ్రీలత, రాజ్‌కుమార్, శ్రీనివాస్, మహిపాల్, సురేశ్, అఫ్రోజ్, గీత, నాగేంద్ర తదితరులున్నారు.

శాంపిల్స్ సన్న బియ్యం.. సంచుల్లో దొడ్డు బియ్యం..

● గ్రామంలో తిరుగుతూ విక్రయం
● మోసానికి గురైనట్లు గుర్తించి బాధితుడి ఆవేదన

హత్నూర, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తక్కువ ఖర్చుతో ఎక్కువ సంపాదించాలన్న దుర్బుద్ధి. సామాన్య వ్యక్తులను ఎంచుకుని... సన్న బియ్యం శాంపిల్స్ చూపించి... సంచుల్లో దొడ్డు బియ్యం ఉంచి నయా మోసానికి ఒడిగట్టాడు ఓ ప్రబుద్ధుడు.. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన హత్నూర గ్రామానికి చెందిన బాధితుడు పొట్లగల బాలయ్య తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం సాయంత్రం ఓ వ్యక్తి తాము గ్రామాలు తిరుగుతూ నెంబర్ వన్ కర్నూల్ సన్న బియ్యం అమ్ముతున్నామని నమ్మించాడు. అంతేకాకుండా ఆవ్యక్తి తన స్కూటీపై శాంపిల్ చూపించడం కోసం తీసుకువచ్చిన 25 కిలోల సన్నబియ్యం బస్తా తెరిచి అందులో నుంచి సన్న బియ్యం చూపించి క్వింటాల్‌కు రూ.5,600ల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలిపాడు. గ్రామ సమీపంలో డీసీఎం నిలిపి ఆర్డర్లు సేకరిస్తున్నట్లు నమ్మ బలికాడు. దీంతో బాధితుడు తనకు క్వింటాల్ 25 కిలోల సన్నబియ్యం కావాలని చెప్పడంతో వెంటనే స్కూటీపై 25 కిలోల చొప్పున 5 బస్తాలు ఉన్నాయని నమ్మించి బాధితుడి నుంచి రూ.6,300 తీసుకుని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తాను కొనుగోలు చేసిన సన్న బియ్యం బస్తా మంగళవారం ఉదయం తెరిచి చూసేసరికి దొడ్డు బియ్యం ఉన్నాయి. అనుమానం వచ్చి మిగతా బస్తాలను తెరిచి చూడగా అన్నింట్లో దొడ్డు బియ్యం ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా 25 కిలోలకు బదులు ఒక్కో బస్తా 20 కిలోలు మాత్రమే ఉండటంతో తాను మోసపోయినట్లు బాలయ్య గుర్తించాడు. నెంబర్ వన్ కర్నూలు సన్నబియ్యం బ్రాండెడ్ లేబుల్ బస్తాలు ఉండటంతో తాను కొనుగోలు చేశానని, తెరిచి చూస్తే నాసిరకం దొడ్డు బియ్యం ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశాడు. ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న ఇలాంటి వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడు వాపోయాడు.

కోర్టును పరిశీలించిన జిల్లా సబ్ జడ్జి జితేందర్

అల్లాదుర్గం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): త్వరలో ప్రారంభంకానున్న అల్లాదుర్గం సివిల్ కోర్టు నూతన భవనాన్ని జిల్లా సబ్ జడ్జి జితేందర్ మంగళవారం పరిశీలించారు. తాత్కాలికంగా స్థానిక వసతి గృహంలో ఏర్పాటుకానున్న ఈ కోర్టును ఏప్రిల్ 3న జిల్లా న్యాయాధికారి లక్ష్మీశారద సందర్శించి, వీటి పనులను పరిశీలించారు. కాగా ఈ కోర్టు ప్రారంభానికి సిద్ధం కావడంతో మరోమారు జిల్లా సబ్ జడ్జి జితేందర్, మెదక్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుభాష్‌చంద్రగౌడ్ భవనాన్ని పరిశీలించారు.

అవుట్‌సోర్సింగ్ ఏఈవోలను ఇబ్బంది పెట్టొద్దు

సిద్దిపేట కలెక్టరేట్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): డిజిటల్ క్రాప్ బుకింగ్ చేయని అవుట్‌సోర్సింగ్ ఏఈవోలను విధుల నుంచి తప్పిస్తామని ఫోన్‌చేసి ఒత్తిడి చేయొద్దని అవుట్‌సోర్సింగ్ ఏఈవోలు మంగళవారం ఇన్‌చార్జి డీఏవోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో, ఉద్యోగ భద్రత లేకపోయినా, వేతనం కాకున్నా విధులు నిర్వహిస్తున్నామన్నారు. రెగ్యులర్ ఏఈవోలతో సమానమైన పని చేస్తున్నా జీతం సమయానికి అందని పరిస్థితి అని వాపోయారు. డిజిటల్ క్రాప్ విషయంలో రెగ్యులర్ ఏఈవోలు ససేమిరా అనడంతో అవుట్‌సోర్సింగ్ ఏఈవోలు చేయాల్సిందేనంటూ ఒత్తిడి చేయొద్దని తెలిపారు. నాలుగేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే ఏజెన్సీ వ్యవస్థను రద్దుచేసి నేరుగా ప్రభుత్వం ద్వారానే ప్రతినెల జీతం వేయాలన్నారు.

సయ్యద్‌నగర్ టు గల్ఫ్

- ఒకే గ్రామం నుంచి వంద మందికిపైగా వలస
- ఉన్న ఊరిలో బతుకుదెరువు లేక అరబ్ దేశాలకు పయనం
- ప్రస్తుతం వివిధ దేశాల్లో ఓ మహిళతో సహా డెబ్బై మంది
- నామమాత్రపు వేతనాలకు గల్ఫ్ దేశాల్లో మగ్గుతున్న సయ్యద్‌నగర్ వాసులు


గ్రామ ముఖచిత్రం

రాయపోల్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : అదో మారుమూల పల్లెటూరు. ఆ గ్రామంలో వందకుపైగా కుటుంబాలు జీవిస్తున్నాయి. ఊరిలో బతుకుదెరువు లేక గల్ఫ్ బాట పట్టారు. దాదాపు ఇంటికొక్కరు ఏడారి దేశాలకు వెళ్లి ఉపాధి పొందుతున్నారు. ఉన్న ఊరిని.. కన్న వాళ్లను.. భార్య పిల్లలను వదిలి ఏళ్లుగా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ గ్రామమే సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలంలోని సయ్యద్‌నగర్.

చుట్టూ అడవీ.. వ్యవసాయం అంతంతే..

సయ్యద్‌నగర్‌లో 120కిపైగా కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో 500 వరకు జనాభా ఉన్నది. గ్రామం చుట్టుపక్కల అటవీ ప్రాంతం కావడంతో అక్కడ వ్యవసాయం అంతంత మాత్రమే. కేవలం బండపై రాళ్లను కొట్టి విక్రయించి జీవిస్తూ ఉంటారు. ఆ పని కూడా అంతంత మాత్రమే కావడంతో వారికి సరైన ఉపాధి కరువైంది. కుటుంబాలను పోషించడం తలకు మించిన భారంగా మారింది. విధిలేని పరిస్థితుల్లో గ్రామంలోని వారు ఒక్కొక్కరుగా అరబ్ దేశాలకు వలస పట్టారు. 30 ఏళ్లుగా ఆ గ్రామం నుంచి గల్ఫ్‌కు వలసలు కొనసాగుతున్నాయి. వారి దయనీయ పరిస్థితిని ఆసరాగా చేసుకున్న ఏజెంట్లు వీసాలు ఇప్పిస్తాం, పని చూపిస్తామంటూ అందినకాడికి దోచుకున్నారు. ఒక్కొక్కరి దగ్గర లక్షల రూపాయలు వసూలు చేసి దుబాయ్, కువైట్, సౌదీ అరేబియా, ఖతర్, ఓమన్ తదితర అరబ్ దేశాలకు పంపించడం ప్రారంభించారు.

గల్ఫ్‌లో గొడ్డు చాకిరి

గల్ఫ్‌కు వెళ్లిన తర్వాత అక్కడి యజమానులు వీరితో గొర్రెలు, ఒంటెలు కాయించడం, నిర్మాణ పనుల్లో రోజుకు సుమారు 12 గంటల పాటు గొడ్డు చాకిరి చేయిస్తున్నారు. అంత కష్టపడినా వీరికి వచ్చే జీతాలు నామమాత్రమే. ఒక్కో దేశంలో ఒక్కో విధంగా వేతనాలు ఉన్నాయి. నెలకు రూ.20 వేల వరకే సంపాదిస్తూ అరబ్ దేశాల్లో ఆగమవుతున్నారు. అది కూడా సమయానికి ఇవ్వకుండా ఇబ్బందులకు గురవుతున్న వారు ఉన్నారు. సయ్యద్‌నగర్ నుంచి ఇప్పటివరకు 100 మందికిపైగా గల్ఫ్ దేశాలకు వలస వెళ్లారు. ఇందులో పలువురు తిరిగి రాగా, ఇంకా 70 మంది వరకు అక్కడే పనిచేస్తూ ఉన్నారు. ఏడాది క్రితం ఇద్దరు మహిళలు ఉపాధి కోసం కువైట్‌కు వెళ్లి ఇళ్లల్లో పనిచేశారు. ఇటీవల ఓ మహిళ తిరిగి రాగా ఇంకొకరు అక్కడే పనిచేస్తున్నది. అక్కడ పనిని తట్టుకోలేక కొందరు, ఆరోగ్యం సహకరించక మరికొందరు తిరిగి వచ్చారు. అప్పు చేసి వెళ్లిన కొన్ని రోజులకే తిరిగి రావడంతో మరింత అప్పుల పాలయ్యారు. తమకు ఉపాధి కల్పిస్తే గల్ఫ్ బాధలు తప్పుతాయని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

అక్కడ చెప్పిన పని చేయాల్సిందే



నేను ఏడేళ్ల పాటు సౌదీ అరేబియాలో పనిచేశాను. అక్కడ వాళ్లు చెప్పిన పని చేయాల్సి ఉంటుంది. కష్టమైనా భరించాల్సిందే. నేను డ్రైవర్‌ను అయినప్పటికీ మొదట్లో నాతో గొర్రెలకు గడ్డి కోయించారు. కొన్ని రోజుల తర్వాత కారు డ్రైవర్‌గా పనిచేశాను. మన కరెన్సీలో నెలకు రూ.20 వేల వరకు వేతనం వచ్చేది.

- ఎండీ గౌస్, సయ్యద్‌నగర్

అరబ్ దేశానికి వెళ్లి అప్పులపాలయ్యా..



నేను సౌదీ అరేబియాకు వెళ్లగా అక్కడ నాతో ఒంటెలను కాయించారు. అక్కడ యజమానులు సరైన ఆహారం పెట్టకపోవడంతో నా లివర్ దెబ్బతిన్నది. అక్కడనే ప్రభుత్వాసుపత్రిలో ఆరు నెలల పాటు చికిత్స చేయించుకుని తిరిగి వచ్చాను. కొంచెం నయం అయిన తర్వాత వెళ్లగా మళ్లీ ఆరోగ్యం దెబ్బతిన్నది. ఇలా సౌదీ అరేబియా వెళ్లడానికి నాకు లక్షల్లో ఖర్చు అయింది. తరచూ ఆరోగ్యం దెబ్బతినడంతో అప్పుల పాలై తిరిగి వచ్చి బండ కొట్టుకుంటూ జీవిస్తున్నాను.

- ఎండీ హుస్సేన్, సయ్యద్‌నగర్


శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

ఎమ్మెల్సీ ఎన్నికలపై డిప్యూటీ తహసీల్దార్లకు శిక్షణ

తూప్రాన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం తూప్రాన్ రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో శిక్షణలో ప్రసంగిస్తూ ఎమ్మెల్సీ పట్టభద్రులు, ఉపాధ్యాయ దరఖాస్తులను ఎప్పటికప్పుడు వెరిఫికేషన్ పూర్తి చేసి ఈఆర్వో లాగిన్‌కి ఫార్వర్డ్ చేయాలని సూచించారు. గత ఆరేళ్లలో కనీసం మూడేళ్లు సెకండరీ స్థాయి కంటే పైస్థాయి ప్రభుత్వ ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు విద్యా సంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నవారు ఫారం 19 ద్వారా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జాబితాలో నమోదు చేసుకోవాలన్నారు. 2021 నవంబరు కంటే ముందు పట్టభద్రులైన వారు ఫారం 18 ద్వారా పట్టభద్రుల ఎమ్మెల్సీల ఓటరు జాబితాలో నమోదు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రెండు జాబితాలో నమోదుకు దరఖాస్తు చేసుకునే వారు ఎక్కడ పని చేస్తున్నా స్థానికంగా నివాసం ఉన్నవారై ఉండాలని తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా సీఈవో తెలంగాణ వెబ్‌సైట్ ద్వారా కూడా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. నవంబరు 6 వరకు పట్టభద్రులు, ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.

టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లో మంగళవారం ఉమ్మడి మెదక్ జిల్లా టేబుల్ టెన్నిస్ క్రీడాకారుల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. పురుషుల విభాగంలో నరేష్ (మిరుదొడ్డి), రవితేజ (కూచన్‌పలి), అనీష్(సర్దన), జూనియర్ బాలుర విభాగంలో నవీన్(సంగారెడ్డి), నరేష్(మెదక్), సాయిసంగమేశ్వర్(సంగారెడ్డి), బాలికల విభాగంలో కౌశిక(మెదక్), రేవతి(కూచన్‌పల్లి), నవ్య(కూచన్‌పల్లి), సబ్ జూనియర్ బాలుర విభాగంలో వర్షిత్(కూచన్‌పల్లి), మహేంద్ర(కూచన్‌పల్లి), ప్రణయ్‌రాజ్(మెదక్)లు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. కొక్కొండ ప్రభు తెలిపారు. ముగింపు కార్యక్రమానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజ్‌కుమార్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కన్వీనర్ శ్యాంరావు, రిటైర్డ్ పీడీ ఆనందం, సంఘ సభ్యులు హనుమంతు, రవితేజ, అనీష్ క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులు


కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న రెసిడెంట్ డైరెక్టర్ వర్మ

పాకశాస్త్ర కళకు లింగ భేదం లేదు

● మాస్టర్ చెఫ్ పోటీలలో నిపుణుల స్పష్టీకరణ

పటాన్‌చెరు రూరల్, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి) : పాకశాస్త్ర కళకు లింగ భేదం లేదని, వంట చేయడం ఒక నైపుణ్యమని, స్త్రీ- పురుష భేదం లేకుండా ప్రతి ఒక్కరికీ అది అవసరమేనని వక్తలు స్పష్టీకరించారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్-లోని కుకింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'మాస్టర్ చెఫ్' పోటీలను ఆద్యంతం ఉత్సాహభరితంగా నిర్వహించారు. గీతం ఆతిథ్య విభాగం సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాకశాస్త్ర కళల గురించి అవగాహన కల్పించాఉ. ఈ పోటీలలో పాల్గొన్న వారు కేవలం వంటకాల రుచిపై మాత్రమే కాకుండా, వారిలోని సృజనాత్మకత, పోషకాహార పరిజ్ఞానాలను కూడా ప్రదర్శించారు. గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ప్రధాన చెఫ్, ఆతిథ్య విభాగం సిబ్బంది ఉల్లాసభరితమైన, ఆకర్షణీయమైన వాతావరణాన్ని పెంపొందించే కార్యక్రమంలో చురుకుగా పాల్గొనేలా విద్యార్థులను ప్రోత్సహించారు.

విద్యుదాఘాతంతో
అన్నదాత మృతి

- బిందు సేద్యం ద్వారా పంటకు నీరందించేందుకు ప్రయత్నిస్తుండగా ప్రమాదం
- తొగుట మండలం గుడికందులలో ఘటన


గురువారెడ్డి(ఫైల్)

తొగుట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతి చెందిన సంఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం గుడికందుల గ్రామంలో మంగళవారం సాయంత్రం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గోరిట గురువారెడ్డి(42)కి గ్రామంలో 5 ఎకరాల 13 గుంటల వ్యవసాయ భూమి ఉంది. ఖరీ్‌ఫలో మొక్కజొన్న పంట సాగు చేసి ఇటీవల కోత కూడా పూర్తిచేశాడు. మరోమారు అదే భూమిని చదును చేసి 3 ఎకరాల్లో మళ్లీ మొక్కజొన్న పంట, మిగతా రెండు ఎకరాలపైచిలుకు పొద్దుతిరుగుడు పంట సాగుచేశాడు. విత్తనాలు మొలకెత్తడానికి బిందు సేద్యంతో స్ప్రింక్లర్లను ఉపయోగించి నీరు పారించేందుకు మంగళవారం యత్నించాడు. వ్యవసాయ భూమి పైనుంచి 11కేవీ విద్యుత్ వైర్లు చేతికందే దశలో ఉన్నాయి. అది గమనించని రైతు స్ప్రింక్లర్ పైపులను బిగిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు ఇనుప పైపులు తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. చుట్టుపక్కల ఉన్న రైతులు చికిత్స నిమిత్తం హుటాహుటిన సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందాడని నిర్ధారించారు. మృతుడికి భార్య రమాదేవి, కుమారుడు లోకేశ్‌రెడ్డి, కూతురు ఆకాంక్ష ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు మిరుదొడ్డి ఎస్‌ఐ పరశురాములు తెలిపారు.

మాస్టార్స్


సిద్దిపేటలో నియామకపత్రం అందుకుంటున్న కొత్త టీచర్

ఆస్పత్రిలో బెడ్ పక్కన ఉండి చదువుకున్నా..



13 సంవత్సరాల కల నెరవేరింది. నేను ఇంటర్మీడియట్ నుంచి పనిచేస్తూనే చదువుకున్నా, డిగ్రీ అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీలో పూర్తిచేశాను. 13 సంవత్సరాలుగా ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేశాను. మా అమ్మకు అనారోగ్యం కారణంగా చాలా సార్లు హాస్పటల్‌లో ఆడ్మిట్ కావాల్సి వచ్చింది. అప్పుడు మా అమ్మ బెడ్ పక్కన ఉంటూ చదువుకున్నాను. పట్టుదలతో ఉద్యోగం సాధించాను. దౌల్తాబాద్ హిందీ పండిట్‌గా పోస్టింగ్ వచ్చింది.

-సల్మా సయ్యద్, శంకర్‌నగర్ సిద్దిపేట

సమయం దొరికినప్పుడల్లా చదివా...



2012 నుంచి ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్నాను. ఇప్పటివరకు 3 సార్లు డీఎస్సీ రాశాను. పిల్లలు పుట్టకముందు వరకు ఓ ప్రైవేట్ స్కూలులో పనిచేశాను. పని ఒత్తిడి ఎక్కువ.. జీతం తక్కువగా ఉండేది. చేస్తే ప్రభుత్వ ఉద్యోగం మాత్రమే చేయాలని నిర్ణయించుకున్నాను. కుటుంబాన్ని, పిల్లలను చూసుకుంటూ సమయం దొరికినప్పుడల్లా ప్రిపేర్ అయ్యాను. సిద్దిపేట కాళ్లకుంట కాలనీ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.

- వీరబత్తిని రజిని, నర్సాపూర్ సిద్దిపేట

వ్యవసాయం చేస్తూ పరీక్షకు సన్నద్ధమయ్యా..



మూడు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమవుతున్నాను. మా గ్రామంలోనే ఉంటూ ఓ వైపు వ్యవసాయం పనులు చేసుకుంటూనే మరోవైపు పరీక్షకు ప్రిపేర్ అయ్యాను. ఏదేమైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించాలనే తపనతో ముందుకెళ్లాను. సొంతగా ప్రణాళిక సిద్ధం చేసుకుని చదవడంతోనే నా లక్ష్యాన్ని చేరుకోగలిగాను. దుబ్బాక ప్రభుత్వ పాఠశాలలో పోస్టింగ్ వచ్చింది.

-గుండెల్లి కుమారస్వామి, లక్ష్మీదేవిపల్లి

పగలు ఉద్యోగం.. రాత్రుల్లో చదువు...



2017 డీఎస్సీలోనే కొద్దిలో ఉద్యోగం మిస్ అయ్యాను. అయినా నిరాశ చెందకుండా ఎలాగైనా ఉద్యోగం సాధించాలనే పట్టుదలతో ప్రిపరేషన్ కొనసాగించాను. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పనిచేస్తూనే డీఎస్సీకి సిద్ధమయ్యాను. పగలు ఉద్యోగ విధుల్లో బిజీగా ఉండడంతో ఎక్కువగా రాత్రి పూట మేల్కొని చదివాను.

-హిమబిందు, స్కూల్ అసిస్టెంట్, సదాశివపేట

2017లోనే వస్తుందనుకున్నా..



2017లోనే వస్తుందని ఆశించినా ఫలితం దక్కలేదు. అప్పటినుంచి నోటిఫికేషన్ రాకపోయినా ప్రిపరేషన్ మాత్రం ఆపలేదు. సొంత ఊరు, తల్లిదండ్రులకు దూరంగా హైదరాబాద్‌లో రూమ్ తీసుకొని చదివాను.

-సీ.హెచ్.రాజు, ఎస్జీటీ, తుర్కవడగాము, కంగ్టి మండలం

పబ్లిక్ లైబ్రరీలోనే చదివా..



సంగారెడ్డి లైబ్రరీలోనే చదివి టీచర్ ఉద్యోగం సాధించాను. రెండేళ్ల నుంచి కష్టపడ్డాను. 2017లో ఉద్యోగం రాలేదనే చింతించకుండా ఇంకా కష్టపడి చదివాను. ఎట్టకేలకు ఉద్యోగం రావడం చాలా సంతోషంగా ఉంది.

-కె.చైతన్య, ఎస్జీటీ, మారెపల్లి, కొండాపూర్

44 ఏళ్లకు సాధించా..



వరుసగా డీఎస్సీ రాసినా ప్రతిసారి స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం కోల్పోయాను. ఆఖరి ప్రయత్నంగా 2024 డీఎస్సీలో ఉద్యోగం సాధించడం ఆనందంగా ఉంది. నేను ఇంటికి పెద్దవాడిని కావడంతో తండ్రి తర్వాత బరువు బాధ్యతలన్నీ తీసుకున్నాను. 21 ఏళ్లుగా ప్రైవేటు లెక్చరర్‌గా పని చేశాను. పట్టుదలతో చదివి ప్రస్తుతం 44 ఏళ్ల వయస్సులో నా జీవిత లక్ష్యాన్ని చేరుకున్నాను.

-మహేష్, కొత్తపల్లి, పాపన్నపేట మండలం

108లో పని చేశాను..



పలుమార్లు డీఎస్సీ రాసిన స్వల్ప మార్కుల తేడాతో ఉద్యోగం పొందే అవకాశాన్ని కోల్పోయాను. అయినా వెనక్కి తగ్గకుండా ఉపాధ్యాయ ఉద్యోగం కోసం కష్టపడి చదివాను. 16 ఏళ్ల పాటు 108లో పని చేస్తూనే పరీక్ష సిద్ధమయ్యాను. ప్రస్తుతం జిల్లాలోనే 2 ర్యాంకు సాధించి తెలుగు పండిట్‌గా ఉద్యోగం సాధించాను.

-పసుల మల్లికార్జున్, రంగంపేట, కొల్చారం మండలం

రెండో ప్రయత్నంలో సాధించాం..



మేము 2018లో వివాహం చేసుకున్నాం. అప్పటికే బీఈడీ పూర్తి చేసి, 2017లో ఇద్దరం డీఎస్సీ రాసినప్పటికీ ఉద్యోగం రాలేదు. మరింత పట్టుదలతో చదివి 2024 డీఎస్సీ రాశాం. ఎస్జీటీలో 42, 65 ర్యాంకులు సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించాం. చాలా సంతోషంగా ఉంది.

- శేఖులు, స్వప్న దంపతులు, కొంగోడ్ గ్రామం, కొల్చారం మండలం

క్రైం కార్నర్

బైకును ఢీ కొట్టిన కారు.. ఒకరి మృతి


మృతి చెందిన మల్లేశం

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : బైకును కారు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల మల్లేశం(45) సోమవారం రాత్రి బైకుపై రాజీవ్ రహదారిపై గ్రామంలోని మీసేవ వద్ద రోడ్డు దాటుతుండగా సిద్దిపేట నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో తీవ్ర గాయాల పాలైన అతడిని 108 అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

బైకు గేదెను ఢీకొట్టి వ్యక్తి..


నాగులు(ఫైల్)

చేగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బైకు గేదెను ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన చేగుంట మండలం బోనాల గ్రామ శివారులో సోమవారం చోటుచెసుకుంది. ఎస్సై చైతన్యరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం పోసానిపల్లి గ్రామానికి చెందిన అబ్బమైన నాగులు(56) అన్న కుమారుడు మల్లేశంతో కలిసి బైకుపై శివాయపల్లిలో బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. రాత్రి తిరిగి వస్తుండగా బోనాల గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న గేదెను బైకు బలంగా ఢీకొట్టింది. వెనుక కూర్చున్న నాగులు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య యాదవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు.

పరువు పోయిందని మహిళ బలవన్మరణం


యాదమ్మ మృత దేహం

చిన్నశంకరంపేట్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలకేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి విభూతి యాదమ్మ (40)తో రెండు రోజుల క్రితం ఓవ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించాడు. దీంతో పరువు పోయిందని మనస్తాపానికి గురైన ఆమె ఇంట్లో ఎవరులేని సమయంలో ఉరెసుకుంది. గమనించిన కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు మృతురాలి భర్త కొన్నేళ్ల క్రితమే మృతిచెందాడు. కుమారుడు శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణ గౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో..

గజ్వేల్ రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గజ్వేల్ మండలం దాతర్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన జూపల్లి అంసమ్మ(45) వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి కొండపోచమ్మ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. మంగళవారం ఉదయం అటుగా వెళ్లిన గ్రామస్థులు అంసమ్మ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న వారు అంసమ్మ మృతదేహాన్ని వెలికి తీసి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

'ఉపాధి' కోసం గ్రామ సభలు

● సంగారెడ్డి అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్

జహీరాబాద్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : నవంబరు 30 వరకు గ్రామసభలు నిర్వహించి పనుల ఎంపికను చేపట్టాలని సంగారెడ్డి అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్‌లోని జహీరాబాద్,మొగుడంపల్లి, కోహీర్, రాయికోడ్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాలకు చెందిన ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంఆ ఆయన మాట్లాడుతూ 2024-25 సంవత్సరానికి సంబంధించి గ్రామాలవారీగా పనులను ఎంపిక చేయాలన్నారు. ముస్ముందు ప్రజల నుంచి ఇబ్బందులు తలెత్తకుండా ఎంపిక ప్రక్రియ సక్రమంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏపీవోలు అశోక్‌కుమార్, రాజ్‌కుమార్, సునందరావు, రంగారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న అదనపు డీఆర్‌డీవో బాల్‌రాజ్ తదితరులు

నీటి సరఫరాపై సహాయకులకు శిక్షణ

● మిషన్‌భగీరథ ఈఈ షేక్‌పాషా

కొండాపూర్, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామలలో ఇంటింటికీ నీటి సరఫరాపై నాలుగు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తునట్లు మిషన్ భగీరథ నీటి సరఫరా ఈఈ షేక్ పాషా తెలిపారు. మంగళవారం కొండాపూర్ ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన గ్రామ (వాటర్ మ్యాన్) తాగునీటి సహాయకుల శిక్షణ తరగతులకు ఈఈ హాజరై మాట్లాడారు. మొదటి రోజు సింగల్, త్రీ ఫేస్ ఆన్ ఆఫ్, రిపేర్, రెండవ రోజు హ్యాండ్ పంపు, మూడవ రోజు పైపు జాయింట్లు, నల్లా కనెక్షన్ ఇవ్వడంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చివరి రోజు నీటి నాణ్యత తెలిపే పరీక్షలపై చర్చ ఉంటుందన్నారు. ఈ శిక్షణ ద్వారా గ్రామల్లో ఎక్కడైనా సమస్య వస్తే వెంటనే పరిష్కరించేందుకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈఈ సూచరిత, ఏఈ రవికుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రమేష్, ల్యాబ్ అసిస్టెంట్ చిరంజీవి పాల్గొన్నారు.


గాలివాన బీభత్సం

- వందలాది ఎకరాల్లో నేలకొరిగిన వరి పైరు
- శివంపేట, చక్రియాల గ్రామాల రైతులకు తీరని నష్టం

పుల్‌కల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పుల్కల్, చౌటకూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. పొద్దంతా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి చేసిన వాతావరణం సాయంత్రానికి చల్లబడింది. ఒక్కసారిగా ఉరుములు, మెరుపులు గాలివానతో కూడిన భారీ వర్షం కురిసింది. దాదాపు గంటపాటు వర్షం కురిసింది. మరో పక్షం, నెల రోజుల వ్యవధిలో కోతకు వస్తుందనుకున్న వరి పంట నేలపాలైంది. వందలాది ఎకరాల్లో వరి పైరు దెబ్బతినడంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు.

పిడుగుపాటుకు యువకుడు మృతి

పుల్కల్ మండలం కోడూరులో విషాదం నెలకొన్నది. గ్రామానికి చెందిన తలారి రాహుల్ వంశీ (22) సోమవారం సాయంత్రం వ్యవసాయ పొలానికి వెళ్లాడు. భారీ వర్షం కురుస్తూ ఒక్కసారిగా పిడుగుపడడంతో అతడు అక్కడికక్కడే కుప్పకూలాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్ద వెతకగా రాహుల్ వంశీ మృతదేహం కనిపించింది. మృతుడి కుటుంబాన్ని అన్నీ విధాల ఆదుకోవాలని మాజీ సర్పంచ్ పట్లోళ్ల నరసింహారెడ్డి కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ పాటిల్ క్రాంతికుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


చక్రియాల గ్రామంలో నేలకొరిగిన వరి పంట

ఏపీజే అబ్దుల్ కలామ్ జయంతి



అక్కన్నపేట: అబ్దుల్ కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

అక్కన్నపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న అవార్డు గ్రహీత దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతిని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జ్యోతి, ఉపాధ్యాయులు జంగపల్లి వెంకటనర్సయ్య, నోముల చంద్రారెడ్డి, గుగులోతు శంకర్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

● **చేర్యాల:** మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని చేర్యాల మండలం అర్జునపట్ల జడ్పీఎస్ఎస్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా పదోతరగతి విద్యార్థి సంధ్యారాణి కలాం వేషధారణలో ప్రదర్శన చేపట్టి కలాం జీవిత విషయాలను వివరించింది.

శిథిలమైన హాస్టల్ భవనం

- అద్దె భవనంలో అరకొర వసతులతో నిర్వహణ
- గత ప్రభుత్వ హయాంలో మొండి చేయి
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు



శిథిలమైన హాస్టల్ భవనం

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కొండపాకలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలమైంది. పూర్తిగా కూలిపోయి రెండు సంవత్సరాలు అయినప్పటికీ నూతన భవన నిర్మాణానికి ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. అద్దె భవనంలో అరకొర వసతులతో హాస్టల్ నిర్వహిస్తున్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన సుమారు 140 మంది విద్యార్థులు హాస్టల్లో ఉంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో హాస్టల్ భవనానికి నిధులు కేటాయించాలని గ్రామానికి చెందిన ప్రజా ప్రతినిధులు మంత్రులను, అధికారులను కోరినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వేలాది రూపాయలు అద్దె భవనానికి ఖర్చు చేస్తున్నప్పటికీ అందులో అరకొర వసతులతో విద్యార్థులు ఉంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలోనైనా హాస్టల్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించాలని కోరుతున్నారు.

భవనాన్ని నిర్మించాలి

కొండపాకలోని హాస్టల్ భవనం పూర్తిగా శిథిలమై కూలిపోయింది. నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయాలి. గతంలో ప్రభుత్వం దృష్టికి ఎన్నోసార్లు తీసుకెళ్లాం. నిధులు మంజూరు చేస్తామని చెప్పారు. కానీ విడుదల చేయలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా నిధులు మంజూరు చేసి భవనాన్ని నిర్మించాలి.

\- మంచాల కనకరాములు, నాయకుడు కొండపాక

అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతి



యాదగిరి గౌడ్ మృతదేహం

దూళిమిట్ట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. మండలంలోని బెక్కల్‌కు చెందిన భైరగోని యాదగిరిగౌడ్ ఆదివారం ఇంటి నుంచి అదృశ్యమైయ్యాడు. మంగళవారం కూటిగల్ శివారులో అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, పోస్టుమార్టం నివేదిక అనంతరం వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు..



వెంకటేష్ (ఫైల్)

కుకునూరుపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కుకునూరుపల్లి ఎస్ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగోల్‌కు చెందిన బస్వరాజు వెంకటేష్(25) దసరా రోజు మద్యం మత్తులో పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబసభ్యులు ప్రజ్ఞాపూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించగా మంగళవారం ఉదయం మృతిచెందాడు. దసరా సందర్భంగా మూడు రోజుల ముందు వెంకటేష్ భార్య కుమారుడిని తీసుకుని ఆమె తల్లిగారింటికి ఇంటికి వెళ్లింది. దసరా రాత్రి 10 గంటల సమయంలో భార్యతో వీడియో కాల్ మాట్లాడాడు. అర్ధరాత్రి పురుగుల మందు తాగాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగు అప్పగింత

చేర్యాల, అక్టోబరు 15: చేర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఓ మహిళ పోగొట్టుకున్న హ్యాండ్‌బ్యాగును పోలీసులు అప్పగించిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఖమ్మం పట్టణానికి చెందిన మురారి రవి కుటుంబీకులు సోమవారం కొమురవెల్లి మల్లన్న దర్శనం చేసుకుని తిరుగుముఖంలో చేర్యాల ఆర్టీసీ బస్టాండుకు చేరుకున్నారు. జనగామకు వెళ్లడానికి వేచిచూస్తున్న క్రమంలో హ్యాండ్ బ్యాగ్ మరచిపోయారు. బ్లూకోల్ట్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుళ్లు సీహెచ్ సుభాశ్, ఆర్ రవి బస్టాండును పరిశీలించడంతో కనిపించిన హ్యాండ్‌బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. రవికి సమాచారం అందించడంతో మంగళవారం అతడి సంబంధీకులు ఠాణాకు రావడంతో బ్యాగులో ఉన్న రూ.3వేలు నగదు, రెండు స్మార్ట్‌ఫోన్లను అప్పగించారు.

డంపింగ్‌యార్డుల్లో ఎరువులు తయారు చేయండి

- పంచాయతీ కార్యదర్శులతో డీపీవో
- పని తీరు మార్చుకోని కార్యదర్శులకు మెమోలు జారీ చేయండి
- జిల్లాలోని ఎంపీవోలతో టెలికాన్ఫరెన్స్‌లో దేవకీదేవి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



లక్ష్మీదేవిపల్లి డంపింగ్ యార్డును పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీరాములు

సిద్దిపేట రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి దేవకీదేవి పంచాయతీ అధికారులను, కార్యదర్శులను హెచ్చరించారు. 'అలంకారప్రాయంగా డంపింగ్ యార్డులు' అనే శీర్షికన మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆమె స్పందించారు. జిల్లాలోని ఎంపీవోలతో ఉదయం టెలికాన్ఫరెన్స్, సాయంత్రం సిద్దిపేట రూరల్, నారాయణరావుపేట మండలాల పంచాయతీ కార్యదర్శులతో ఆన్‌లైన్ మీటింగ్ నిర్వహించినట్లు సమాచారం. గ్రామాల్లో సేకరించిన తడి, పొడి చెత్తను డంపింగ్ యార్డులకు తరలించి ఎరువులు తయారు చేసే విధంగా చూడాలని, వారం రోజుల్లో అన్ని డంపింగ్ యార్డులు నిర్వహణలో ఉండేలా చూడాలని, పని తీరు మార్చుకోని పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేయాలని ఎంపీవోలను ఆదేశించినట్లు తెలిసింది. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు రోజువారీగా చేయాల్సిన విధులు గురించి ఆన్‌లైన్ మీటింగ్‌లో వివరించినట్లు సమాచారం. లక్ష్మీదేవిపల్లి, మల్యాల పంచాయతీ కార్యదర్శులకు మెమోలు జారీ చేశామని, మిగతా గ్రామాల కార్యదర్శులను హెచ్చరించినట్లు ఎంపీవో శ్రీనివాస్‌రావు తెలిపారు. డంపింగ్‌యార్డులను ఎంపీడీవో పరిశీలించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

● ఏసీపీ సతీష్

హుస్నాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణం శివారులోని కరీంనగర్ రోడ్డులో చిరు వ్యాపార కేంద్రాలను ఏర్పాటు చేసుకుని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారం మేరకు మంగళవారం ఏసీపీ సతీష్ వాటిని తొలగించారు. అక్కడ ఉన్న వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని ప్రజల నుంచి పెద్ద ఎత్తున ఫిర్యాదులు వస్తున్నాయని, ఎవరైనా ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మహేశ్, కమిషనర్ మల్లికార్జున్ తదితరులున్నారు.

● **రాయపోల్:** గ్రామాల్లో ప్రశాంత వాతావరణంలో జీవనం కొనసాగించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని రాయపోల్ ఏఎస్ఐ దేవయ్య సూచించారు. మంగళవారం రాయపోల్ పోలీస్‌స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు

● జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక

చిన్నకోడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి రాధిక హెచ్చరించారు. మండలంలోని చిన్నకోడూరు, గంగాపూర్ గ్రామాల్లో మంగళవారం ఫర్టిలైజర్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఫర్టిలైజర్ షాపుల్లోని ఎరువులు, పురుగు మందుల రికార్డులను, అనుమతి పత్రాలను పరిశీలించారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. అనంతరం ఆమె చిన్నకోడూరు రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏవో జయంత్‌కుమార్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ఆకునూరు జడ్పీఎస్ఎస్ విద్యార్థినులు



జాతీయస్థాయి యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, అమ్మఆదర్శ కమిటీ సభ్యులు

చేర్యాల, అక్టోబరు 15: చేర్యాల మండలం ఆకునూరు జడ్పీఎస్ఎస్‌కు చెందిన 8వతరగతి విద్యార్థిని ఎం. సాత్విక, 7వతరగతి విద్యార్థిని పి.అవంతిక జాతీయస్థాయి యోగాపోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల సంగారెడ్డిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ప్రతిభ కనబరిచారు. నవంబరు 8 నుంచి 12వతేదీ వరకు అస్సాం గౌహతిలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలలో పాల్గొననున్నారు. ఈమేరకు సందెబోయిన వెంకటేశ్ రూ.8వేలు విలువగల యోగా దుస్తులను విద్యార్థులకు విరాళంగా అందించగా, అమ్మఆదర్శ కమిటీ ఛైర్మన్ సైదా, పాఠశాల హెచ్ఎం ఐలయ్య, ఉపాధ్యాయులు మంగళవారం విద్యార్థులతో పాటు పీఈటీ కవితను సత్కరించి అభినందించారు.

అందని ద్రాక్షగా టీ ఫైబర్ నెట్ కనెక్షన్

● నాలుగేళ్లుగా ఎదురుచూపులే!



మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన టీ ఫైబర్ నెట్ పరికరాలు

మద్దూరు, అక్టోబరు 15 (ఆంధ్యజ్యోతి): గ్రామపంచాయతీల పరిధిలో టీ ఫైబర్ నెట్ కనెక్షన్ సేవలు అందని ద్రాక్షగా మారాయి. ప్రభుత్వం ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలోని ఇంటింటికీ ఇంటర్ నెట్ కనెక్షన్ సేవలు అందించేందుకు 2020లో మండల పరిషత్ కార్యాలయంతో పాటు గ్రామపంచాయతీలలో అవసరమైన పరికరాలు బిగించారు. అప్పటి నుంచి నెట్ సేవలు కోసం మండల ప్రజలు ఎదురుచూస్తున్నారు. మొదటగా ప్రభుత్వ కార్యాలయాలకు, ఆ తర్వాత ఇంటింటికీ నెట్ సేవలు అందిస్తామని చెప్పినప్పటికీ, ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఇతర మండలాల్లో ప్రభుత్వ కార్యాలయాలైన సోషల్ వేల్ఫేర్‌తో పాటు రైతు వేదికలకు నెట్ సేవల్ని అందిస్తున్నారు. ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తే ఇంటింటికీ టీ ఫైబర్ సేవలు అందనున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ప్రతీ ఇంటి నుంచి చెత్త సేకరణ జరగాలి

● సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

సిద్దిపేట టౌన్, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ప్రతిరోజూ ప్రతి ఇంటి నుంచి తడి, పొడి, హానికర చెత్తను వేరువేరుగా సిబ్బంది తప్పకుండా సేకరించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ ఆదేశించారు. సిద్దిపేట పటణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద ఇంటింటి చెత్త సేకరణ చేసే మున్సిపల్ వాహనాల డ్రైవర్లతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణంలో ఇంటింటి చెత్త సేకరణలో ముఖ్యపాత్ర పోషించే చెత్త వాహనాల డ్రైవర్లు, సిబ్బంది మున్సిపల్ కార్యాలయంలో హాజరు తీసుకున్న అనంతరం వెంటనే వార్డుల్లో చెత్త సేకరణకు వెళ్లాలని ఆదేశించారు. సరైన సమయానికి వార్డులలోకి వెళ్లేనే పట్టణ నివాసితులు చెత్తను వేరు చేసి వాహనానికి ఇస్తారన్నారు. అన్ని వాహనాల ఫిట్‌నెస్‌ను చెక్ చేపించాలని సిబ్బందిని ఆదేశించారు. వాహనాల్లో ఏవైనా ఇబ్బందులు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇంటింటి చెత్త సేకరణ చేస్తున్న సమయంలో ప్రతీరోజు ప్రతి వార్డులో 10 గృహాల నుంచి చెత్త సేకరణ చేసినట్లుగా వారి వద్ద నుంచి సంతకాలు పుస్తకంలో సేకరించాలని సూచించారు. సమావేశంలో డీఈ ప్రేరణ, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మాధవి, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



డ్రైవర్లతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్

వ్యవసాయ మార్కెట్‌కు స్థలాన్ని కేటాయించాలి

● తహసీల్దార్‌కు సీపీఐ నాయకుల వినతి

చేర్యాల, అక్టోబరు 15,(ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మండలం ఐనాపూర్‌లో వ్యవసాయ మార్కెట్ స్థలాన్ని పరిరక్షించి ధరణిలో మార్కెట్ స్థలంగా నమోదుచేయాలని కోరుతూ మంగళవారం సీపీఎం నాయకులు కొమురవెల్లి తహసీల్దారు లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందించారు. ఐనాపూర్ గ్రామరెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 60, 61లలో 5.33 ఎకరాల శివాలయం భూమిని కొన్నేళ్లుగా వ్యవసాయ మార్కెట్‌కు వినియోగిస్తున్నారని తెలిపారు. కొనుగోళ్ల ఇతరత్రా విషయంలో సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, మార్కెట్ కోసం శాశ్వత పరిష్కారంగా స్థలాన్ని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వుల్లపంల్లి సాయిలు, సున్నం యాదగిరి, సుక్క ఎల్లయ్య, పాశం చంద్రయ్య, గోరేమియా, తేలు కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విజయ దుర్గామాత శోభాయాత్ర



కొండపాక: విజయ దుర్గామాత శోభాయాత్ర

కొండపాక, అక్టోబరు 15: మండలంలోని మర్పడగ క్షేత్రంలో విజయదుర్గా మాత రథోత్సవం కనుల పండుగగా సాగింది. రథంపై ఉత్సవ విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు.

● **మిరుదొడ్డి:** మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల్లోని వివిధ గ్రామాల్లో దేవీశరన్న వరాత్రోత్సవాలు ఘనంగా ముగిశాయి. అమ్మవారిని రథంలో ఊరేగించారు.

'స్వేరోస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలి'

మర్కుక్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో నిర్వహించే స్వేరోస్ జాతీయ సదస్సును విజయవంతం చేయాలని స్వేరోస్ నెట్వర్క్ సిద్దిపేట జిల్లా గౌరవ అధ్యక్షుడు బిక్షపతి కోరారు. మండల కేంద్రంలో మంగళవారం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్‌తో పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

సిద్దిపేట టౌన్, అక్టోబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు అర్హులైన వారికి అందేలా చూడాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహ సూచించినట్లు కాంగ్రెస్ సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్, పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి దామోదర రాజనర్సింహను మంగళవారం వారు వేరువేరుగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్ హయాంలోనే న్యాయం జరుగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సూచనతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని చెప్పారు. రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల మాదిరిగానే సిద్దిపేటలో కూడా పనులు యథావిధిగా కొనసాగుతాయని మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ మాట ఇచ్చారన్నారు. కార్యక్రమంలో నాయకులు గయాజుద్దీన్, నజ్జు, మధు, అనిల్ ఉన్నారు.



టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో మాట్లాడుతున్న అత్తు ఇమామ్

గాలికుంటు వ్యాధి పట్ల అప్రమత్తత అవసరం

● పశుసంవర్ధక శాఖ ఏడీ రమేశ్‌బాబు

గజ్వేల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పశువుల్లో గాలికుంటు వ్యాధి పట్ల పశుపోషకులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రమేశ్‌బాబు అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని రాజిరెడ్డిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని మున్సిపల్ వైస్ ఛైర్మన్ జకీయొద్దీన్‌తో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడీ రమేశ్‌బాబు మాట్లాడారు. పశు ఆరోగ్య సంరక్షణ లక్ష్యంగా ఈనెల 15 నుంచి నవంబరు 14 వరకు గ్రామాల్లో గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పశువుల నోటిలో, కాలిగిట్టల మధ్య పుండ్లు రావడం, జ్వరం ఉండడం గాలికుంటు వ్యాధి లక్షణాలని తెలిపారు. ముందస్తు టీకా వేయడంతో పశువులను ఈ వ్యాధి నుంచి కాపాడుకోవచ్చని, దీనిని దృష్టిలో పెట్టుకుని గ్రామాల్లో రైతులను చైతన్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాజిరెడ్డిపల్లి పశు వైద్య శిబిరంలో 48 పశువులకు గాలికుంటు నివారణ టీకా వేసినట్లు తెలిపారు. వారితో కౌన్సిలర్ బాలమణి శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్య సిబ్బంది మీనా, హాజీ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో ప్రభుత్వ నిర్లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : వరి కోతలు ప్రారంభమైనప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మాజీ ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్ ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించేందుకు వచ్చే మంత్రిని, కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. వరదల వల్ల నష్టపోయిన రైతులకు రూ. 10 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

'బోర్డులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

కొండపాక, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖమ్మంపల్లిలో ప్రభుత్వ భూమిలో ఏర్పాటు చేసిన బోర్డులు తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు అధికారులను కోరారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూమిని గుర్తించి అందులో బోర్డులు ఏర్పాటు చేశారు. వాటిని రేపాక కనకయ్య అనే వ్యక్తి తొలగించాడని గ్రామస్థులు తహసీల్దార్‌తో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నేషనల్ ట్రెక్కింగ్‌లో విద్యార్థి

గజ్వేల్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూరు జిల్లాలో 35వ ఆంధ్రప్రదేశ్ బెటాలియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ ట్రెక్కింగ్ క్యాంపులో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హై స్కూల్ పదోతరగతి విద్యార్థి దూలం మణికంఠ క్యాంపులో పాల్గొన్నాడు